క్లుప్తంగా

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న జయశ్రీ

జమ్మికుంట: రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, కమిషన్లు దండుకుంటున్న బీఆర్ఎస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందకుండా చేస్తుందని, దేశం, ధర్మం కోసం బీజేపీ పనిచేస్తుందని, 2023లో బీఆర్ఎస్‌ను గద్దె దించడం ఖాయమని, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, గర్రెపల్లి నిరూపరాణి, ఎండీ రజీయా, ఇటికాల స్వరూప, గంగాభవానీ, మాధవి, కీర్తి, అనుష, పూజ, స్వప్న, స్వామి, సరిత, శ్రీలక్ష్మి, లలిత, మమతతదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు గడిచినా నిరుద్యోగ భృతి అమలేది



గన్నేరువరంలో బీజేవైఎం సమావేశం

గన్నేరువరం: మోస పూరిత హామీలు.. యువత జీవితాలతో చెలగాటమడుతున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి యువత సంఘటిత శక్తిని చాటాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దురిశెట్టి సంపత్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో భారతీయ యువ మోర్చా మండల అధ్యక్షుడు పంబాల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నిరుద్యోగ భృతి నాలుగేళ్లు గడిచినా అమలు చేయడం లేదని, యువతను ఓటు బ్యాంకుగా చూస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఈసారి జశ్వంత్, జిల్లా కార్యదర్శి తిప్పర్తి నికేశ్, మండల ఉపాధ్యక్షుడు బండి తిరుపతి, విరగోని వెంకటేశ్, గంగాధర తిరుపతి, యువమోర్చా మీడియా కన్వీనర్ మచ్చ మురళీకృష్ణ, జాడి గెపు వినయ్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ జెన్‌నెక్ట్స్ స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. గంగిరెద్దుల ఆట, హరిదాసుల ఆటపాటలతో పాటు ఇతర సంప్రదాయాలను విద్యార్థులు ప్రదర్శించారు. వేడుకలను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

కూలీల వివరాలు ఆన్‌లైన్‌లో అందించాలి



మాట్లాడుతున్న సంధ్యారాణి

శంకరపట్నం: ఉపాధిహామీ కూలీలకు వేతనాలు అందించేందుకు ఆధార్ లింక్ చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పల్లెప్రగతి పనులకు సంబంధించి, పని ప్రదేశంలో కూలీల వివరాలు ఆన్‌లైన్‌లో అందించాలని సూచించారు. నర్సరీల్లో పెరిగిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద ఉన్నారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

గంగాధర: మండలంలోని కాచారం గ్రామానికి చెందిన పూరెళ్ళ మహేందర్ గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్ చేసి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామానికి రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారని, రోడ్డు వేయనందున రాజీనామా చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు పనుల గురించి మాట్లాడుదామని కార్యాలయానికి రావాలని సూచించారు.

పొలాలు ఎండుతున్నాయి

- లోవోల్టేజీతో కాలిపోతున్న మోటార్లు
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయని అధికారులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ఇరవై నాలుగు గంటల ఉచిత విద్యుత్ ఉత్తమాటే అవుతోంది. యాసంగిలో అన్నదాతను ఆదిలోనే కరెంట్ కలవర పెడుతోంది.మండలంలోని వెదిర గ్రామానికి చెందిన నిట్టు బీరయ్య ఐదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. బీరయ్య దురదృష్టమో ఏమో కానీ నాలుగు సార్లు మోటారు కాలిపోవడంతో దున్నిన పొలం కాస్తా ఎండిపోతోంది. మరమ్మతులకు రూ. 20 వేల వరకు ఖర్చు అయింది. ఇది ఒక్క బీరయ్యదే కాదు ఇలాంటి ఎందరో బీరయ్యలాంటి రైతులు నిత్యం విద్యుత్ సమస్యతో ఆందోళన చెందుతున్నారు.



గుడ్డివెలుగులపల్లిలో ఎండిపోతున్న పొలం

రామడుగు: రైతులు వరి సాగుచేయడానికి సిద్ధమవుతుండగా విద్యుత్ సమస్యతో పొలాలు ఎండిపోతున్నాయి. ప్రధానంగా లో వోల్టేజీతో పాటు, అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాత పరిస్థితి దయనీయంగా మారింది. కొందరు రైతులు విద్యుత్ మోటార్లు నాలుగైదుసార్లు కాలిపోతుండటంతో నానా ఇబ్బందులుపడుతున్నారు.

మండలంలో 23 గ్రామాలకు కొత్తపల్లి, రుద్రారం, షానగర్, గుండి, బూరుగుపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్లు నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. మండలంలో 1470 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 6,760 వ్యవసాయ విద్యుత్ మోటార్లు, 600 వరకు కమర్షియల్, 370 గ్రామ పంచాయతీ, 10,000 వరకు ఇంటి కనెక్షన్లు ద్వారా నిత్యం విద్యుత్ సరఫరా జరుగుతోంది.

● పది నుంచి ఇరవై సార్లు ట్రిప్పు

కరెంట్ సరఫరాలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు రోజులో 10 నుంచి 20 సార్లు ట్రిప్పు అవుతుండటంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా ప్రతి ట్రాన్స్‌పార్మర్‌కు స్థాయికి మించి విద్యుత్ మోటార్ల కనెక్షన్స్ ఉండడంతో లో వోల్టేజీ సమస్య వస్తోందని రైతుల ఆవేదన.

● కలగానే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

గ్రామాల్లో నీటి సౌకర్యంతో పంట సాగు వీస్తీర్ణం పెరిగింది. రైతులు నూతనంగా విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. దీనికి అనుగుణంగా విద్యుత్ శాఖ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో పరిస్థితి ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

● నాటు వేసిన తర్వాత

మండలంలోని వెలిచాల గ్రామ పరిధి గుడ్డివెలుగులపల్లిలో దాదాపు రెండు వందల ఎకరాల్లో వరినాటు వేసిన తర్వాత విద్యుత్ సమస్యతో మోటార్లు కాలిపోతుండటంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించడం లేదు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యకు పరిష్కారం చూపడటం లేదని ఆయా గ్రామాల రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ మోటారు ఒక్కసారి కాలిపోతే రూ. 5 నుంచి ఆరు వేల వరకు ఖర్చు వస్తుంది. ఇదీ రైతులకు మోయలేని భారమతుంది.



మోటార్లకు వైడింగ్ చేస్తున్న మెకానిక్

ఇరవై రోజుల్లో మూడుసార్లు కాలిపోయింది



నేను విద్యుత్ మోటార్ మెకానిక్. అయినప్పటికీ నా మోటారు ఇరువై రోజుల్లో మూడుసార్లు కాలిపోయింది. లోవోల్టేజీతో కాలిపోతున్నాయి. గ్రామం నుంచి కాలిపోయిన మోటార్లు రిపేర్ కోసం తీసుకువస్తున్నారు.

– కుంట లచ్చయ్య, మెకానిక్(రైతు),వెదిర

పరిష్కరించడంలేదు



ఇరువై రోజుల నుంచి మోటార్లు కాలిపోతున్నాయి. నాటు వేసిన తర్వాత ఎండిపోయ్యే పరిస్థితి వచ్చింది. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకవచ్చినప్పటికీ పరిష్కారం చేయడంలేదు.

– తాడెం రాములు, రైతు, గుడ్డివెలుగులపల్లి

కెపాసిటర్లు బిగించుకోవాలి

రైతులు మోటార్ల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలి. దీంతో చాలా వరకు విద్యుత్ సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉంది. మోటార్లు కాలిపోయే అవకాశం తక్కువ. కెపాసిటర్ల బిగించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– శంకరయ్య, ట్రాన్స్‌కో ఏఈ, రామడుగు

ముళ్లపొదలు తొలగింపు



సాక్షి స్పందన

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి సంగోజిపేట చెరువుకట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు కమ్మేయడంతో పట్టించుకునే వారు కరువయ్యారని, డిసెంబర్ 30న 'సాక్షి'లో ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేస్తున్నాయి అనే ఫొటో స్టోరీ ప్రచురితమైంది. కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రాగిజావ అందజేత



రాగిజావ అందిస్తున్న మహేందర్, హెచ్ఎం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాగిజావ అందించారు. వారానికి మూడు రోజుల చొప్పున విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ మహేందర్ గౌడ్, హెచ్ఎం అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

సైదాపూర్: మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కుమార్‌రాజా, కృష్ణమూర్తిలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అనేక మంది ఉదయం మండల కేంద్రం సైదాపూర్ నుంచి సోమారం చౌరస్తా వరకు నిత్యం వాకింగ్ చేస్తున్నారని, ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, మండల కేంద్రంలో వాకింగ్ కోసం గ్రౌండ్, అందులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: విద్యార్థులు ఇష్టంతో చదువుతూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. గురువారం మానకొండూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన బోధనా అభ్యాసన సామగ్రి మేళాను ప్రారంభించి మాట్లాడారు. టీచర్లు చెప్పిన విషయాలను శ్రద్ధగా వినాలని, ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులను కల్పిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన పరికరాలను పరిశీలించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి అభినందించారు. కార్యక్రమంలోజిల్లా విద్యాధికారి జనార్దన్, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మండల విద్యాధికారి మధుసూదనాచారి, ఉపాధ్యాయులు వంతడ్పుల శ్రీనివాస్, పిట్టల మధు, ఉండింటి శ్యాంసన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ముఖ్యమని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. గురువారం చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ఆశ డే' సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. పీహెచ్‌సీలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ధర్మానాయక్, కార్తిక్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేవరకూ పోరాటం



మాట్లాడుతున్న గోవిందుసురేశ్ మాదిగ

మానకొండూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు మాదిగలు పోరాటం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు సురేశ్‌మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి తుంగ అంజనేయులు అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్ సంస్థాగత నిర్మాణ సభ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో వర్గీకరణ చేస్తామని మాయమాటలతో కాలయాపన చేస్తోందన్నారు. వర్గీకరణకు 28 ఏళ్లుగా పోరాటం చేస్తున్న సమస్య పరిష్కరించటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, ఇప్పటికైనా పార్లమెంటులో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, అనిల్, ముఖేశ్, రాజేశ్వర్, తిరుపతి, ఎల్లయ్య, శ్రీనివాస్, మహేష్, ఈశ్వర్, రంగస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలి



యూనిట్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

వీణవంక: దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలని ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో అన్నారు. గురువారం మండలంలోని చల్లూరు గ్రామంలో పథకం కింద మంజూరైన యూనిట్లను పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెంట ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ జ్యోతిరమేశ్ ఉన్నారు.

దళితబంధు యూనిట్లు అమలు చేయాలి

హుజూరాబాద్: ప్రభుత్వం రెండో విడత దళితబంధు యూనిట్లను అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి సంపత్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దళితబంధు రెండో విడత కార్యక్రమం అమలులో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పేదలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు కోలపూరి ప్రభాకర్, నాయకులు వడ్లూరి కిషోర్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పలువురికి దళితబంధు పథకం కింద మంజూరైన యూనిట్లను గురువారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రావు, భూంపెల్లి రాజలింగం, సందమల్ల బాబు, బిట్లా వెంకటేష్, మోరే మధు, మోరే మహేష్, రమేష్, సారయ్య, శ్రీనివాస్, సందీప్ తదితరులు ఉన్నారు.

రహదారులపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడుస్తున్న నాయకులు

గన్నేరువరం: యువజన సంఘాల నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వివిధ గ్రామాల్లో రహదారులపై ఏర్పడిన గుంతల పూడ్చివేత కార్యక్రమం చేపట్టారు. గన్నేరువరం నుంచి ఖాసీంపేట వరకు, చొక్కారావుపల్లె నుంచి రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు రహదారులపై ఏర్పడిన గుంతలను టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకువచ్చి పూడ్చివేశారు. గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండటంతో పూడ్చివేతకు యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బులతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఖాసీంపేట ఉపసర్పంచ్ బద్దం సంపత్ రెడ్డి, సింగిరెడ్డి లక్ష్మీకాంతరెడ్డి, తిప్పర్తి పరిపూర్ణచారి, శ్రీధర్‌రెడ్డి, ఏలేటి వెంకటరమణరెడ్డి, బద్దం కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, గంట గౌతమ్, కుర్ర హరీష్, బద్దం లచ్చిరెడ్డి, బండి తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



సన్మానిస్తున్న అనిల్‌కుమార్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన కుందేళ్ల అక్షిత (ఏడో తరగతి)ను ద్రోణాచార్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ కరీంనగర్‌కు చెందిన చింతపూల అనిల్‌కుమార్ ఘనంగా సన్మానించారు. గురువారం తోటి స్నేహితులతో కలిసి అక్షితతో పాటు మరో ఇద్దరు విద్యార్థులను సన్మానించారు. ఇటీవల బిర్లా ఇంటర్‌నేషనల్ స్కూల్ కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయస్థానంలో అక్షిత రాణించింది. కాగా అక్షితను జిల్లా స్పోర్ట్స్ స్కూల్‌లో చదివిస్తానని, ఇంటర్ కూడా ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. పదోతరగతిలో 10, 9.5 జీపీఏ సాధించిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానుగంటి రాజమౌళి, ఉపాధ్యాయులు జ్యోత్స్న, గోవర్దన్, శంకరమ్మ, ప్రతి, త్రివేణి తదితరులున్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎనిమిదేళ్ల మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలు లాభపడ్డాయని, పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ కంపెనీలు చేతిలో పెట్టుకొని శాసిస్తున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆయా గ్రామ కమిటీల ఎన్నిక తర్వాత పార్టీ పూర్వ వైభవానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మోహన్,రామ్ చరణ్,కొల్లూరి కిరణ్, సొల్లు బాబు,తిప్పారపు సంపత్, సజ్జు,శ్రీనివాస్, సాయిని రవి,రమేష్, ఆలేటి సుశీల,వేముల పుష్పలత, పానుగంటి కిరణ్‌రెడ్డి, అప్సర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న కార్పొరేటర్ సల్ల శారద

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో గురువారం కార్పొరేటర్ సల్ల శారద పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఖరీదైన వైద్యం అందని పేదలకు సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

✦ డిజిటల్ కీ ఇవ్వడం లేదని ఫిర్యాదు

చొప్పదండి: కేంద్ర ప్రభుత్వం సర్పంచులకు, ఉపసర్పంచులకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి డిజిటల్ కీ ఇవ్వగా దాన్ని అధికారులు తమవద్దే ఉంచుకున్నారని మండలంలోని భూపాలపట్నం ఉపసర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిజిటల్ కీ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులకు సమాచారం అందించడంతో సర్పంచ్, ఉప సర్పంచ్‌లను పిలిపించి డిజిటల్ కీ అందించారు. సమస్యను పరిష్కరించిన ఎస్ఐ ఉపేంద్రచారి, ఎంపీడీవో స్వరూపకు కిట్టుగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

✦ రాబోయే రోజుల్లో అధికారం ఖాయం

వీణవంక: తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాకలో మాట్లాడారు. బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని, రాబోయే రోజుల్లో దేశంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలే ఆదర్శమన్నారు. ప్రతిపక్షాలు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అభివృద్ధి పనులకు కృషి చేయడం అభినందనీయమన్నారు.

✦ పోతిరెడ్డిపల్లిలో డీఎల్‌పీవో విచారణ

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో హుజూరాబాద్ డీఎల్‌పీవో శ్రీలత విచారణ చేపట్టారు. గ్రామసభలు, జీపీ పాలకవర్గం సమావేశాలు నిర్వహించడం లేదని, సర్పంచ్, జీపీ కార్యదర్శి సమావేశాలను జరపకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, సర్పంచ్ భర్త అజమాయిషీ చేస్తున్నాడని గ్రామానికి చెందిన రాపర్తి అరవింద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పంచాయతీ ఆవరణలో వార్డు సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేశారు. నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిసింది.

✦ రెడ్డి సంఘం కార్యవర్గం

చొప్పదండి: మండలంలోని కొలిమికుంట రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాయివరుణ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ కోటేశ్, మాజీ సర్పంచులు మల్లేశం, చొక్కాల్ల పుష్పలతలు అభినందించారు.

✦ బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ బీజేపీ నూతన బూత్ కమిటీని గురువారం ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి కట్ట రవీందర్ తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా కమిటీ సభ్యులు బద్దం లక్ష్మారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

✦ నూతన కమిటీ

మానకొండూర్: బీజేపీ కిసాన్ మోర్చా మానకొండూర్ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపల్కల గ్రామానికి చెందిన అడప రవి, మండల ప్రధాన కార్యదర్శులుగా గాడిచర్ల భూమయ్య, బుర్ర సత్యనారాయణను నియమించామని పార్టీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ తెలిపారు.

✦ దోమలమందు పిచికారీ

చొప్పదండి: ఆరో వార్డులో మున్సిపల్ సిబ్బంది గురువారం దోమల మందు పిచికారీ చేశారు. వార్డు పరిధిలో దోమలు వృద్ధి చెందుతున్నాయని నివారణ చర్యలు చేపట్టారు. ప్రతిరోజు దోమల మందు పిచికారీ చేయాలని స్థానికులు కోరారు.